క్లుప్తంగా

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ అవసరం

ఎంవీపీకాలనీ: ఆధునిక జీవనశైలిలో ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించడం అత్యంత కీలకమని ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జి.త్రివేణిరెడ్డి, డాక్టర్ మేఘనాథ్ యెన్ని పేర్కొన్నారు. ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆస్పత్రిలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజిషియన్ డాక్టర్ త్రివేణి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో యాంత్రిక జీవనం కారణంగా సౌకర్యాలతోపాటు శారీరక సమస్యలు కూడా ఉన్నాయన్నారు. వాటిని అధిగమించడానికి ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ఉత్తమమైనదని సూచించారు. కూర్చున్న చోటకే అన్ని సౌకర్యాలు రావాలనే విధంగా కాకుండా ప్రతి ఒక్కరూ కొంత శారీరక శ్రమ చేసేందుకు కృషి చేయాలన్నారు. సహజ సిద్ధంగా పండే కూరగాయలు, పండ్లు తినడంతోపాటు రాత్రి త్వరగా పడుకోవడం, త్వరగా నిద్రలేవడం వంటి అలవాట్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెప్పారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మేఘనాథ్ మాట్లాడుతూ ఫాస్ట్, జంక్ ఫుడ్ కల్చర్ కారణంగా మనిషి తన ఆరోగ్యాన్ని తానే పాడుచేసుకుంటున్నాడన్నారు. ఆధునిక సౌకర్యాల కారణంగా శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో వ్యాయమం తప్పనిసరనే నియమం ప్రతి ఇంట్లోను రావాలన్నారు. చాలా మంది డాక్టర్లను సంప్రదించకుండానే ఇంటర్‌నెట్‌లోని సమాచారంతో పలు సమస్యలకు మెడిసన్లు వాడుతున్నారని చెప్పారు. దీనివల్ల భవిష్యత్‌లో తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు మెడికవర్ డాక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆరిలోవ: ఆరిలోవలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 11వ వార్డు ఎస్టీ కాలనీలో రవితేజ(26) అనే వ్యక్తి తల్లి, అక్క, బావతో కలిసి నివసిస్తున్నాడు. వివాహితుడైన రవిజేత మద్యం, గంజాయికి బానిసయ్యాడు. దీంతో గొడవల కారణంగా ఇటీవల భార్యభర్తలు విడిపోయారు. శనివారం రాత్రి ఇంట్లో గర్భిణీతో ఉన్న అక్క పొట్టపై బలంగా కొట్టాడు. నొప్పితో ఉన్న ఆమెను తల్లి, భర్త ఆరిలోవలోని ఎఫ్ఆర్‌యూకి వైద్యం కోసం తీసుకెళ్లారు. తిరిగి ఇంటికి చేరేసరికి రవితేజ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ సీఐ సిహెచ్.మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న విష్ణుకుమార్‌రాజు

ఎంవీపీకాలనీ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడానికి బీజేపీ అందిస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 వరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఎవరు ఏ కేసుల్లో ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మద్యం షాపుల వద్ద తాగి గొడవలు చేస్తే చర్యలు ఊరుకునేది లేదన్నారు. రౌడీషీటర్లందరూ మంచిగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. హాజరు కాని రౌడీషీటర్‌కు ఫోన్‌లో మాట్లాడి కౌన్సెలింగ్ చేశారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు తప్పనిసరిగా రావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

మందులేవి..?



కూటమి పాలనలో ప్రజారోగ్యం పడకేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరతే ఇందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదవుతున్న ప్రజలకు ఆరోగ్యం.. సంక్షేమం అందించడంలో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. ముఖ్యంగా ప్రజలకు ఆరోగ్యం, విద్య అనేది చాలా అవసరం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రెండు రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. సిబ్బంది కొరత లేకుండా ఖాళీలను భర్తీ చేశారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. ఆస్పత్రుల నిర్వహణను పట్టించుకోవడం లేదు సరికదా.. కనీసం మందుల సరఫరా కూడా సరిగ్గా చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో పేదలకు మెరుగైన వైద్యం కరువైంది.

– బీచ్‌రోడ్డు

- ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత
- బయట మెడిసిన్ కొనలేక ఇబ్బందులు పడుతున్న రోగులు
- పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆస్పత్రుల నిర్వహణను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు

పాన్‌టాప్ ట్యాబ్లెట్ల సరఫరా నిలిపివేత

పాన్‌టాప్.. సాధారణంగా ఒక మనిషి తన జీవితంలో ఏదో ఒకసారి వేసుకునే ట్యాబ్లెట్. ఇది గ్యాస్ట్రిక్ సమస్య రాకుండా చాలా మందులకు అనుసంధనంగా ఇస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ట్యాబ్లెట్ల సరఫరా పూర్తిగా నిలిపివేశారు. దీని బయట ధర పది టాబ్లెట్లకు సుమారు రూ.120 ఉంటుంది. ఇంత పెట్టి పేద రోగులు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు.



పెదవాల్తేరులోని ప్రభుత్వ శ్వాసకోశ వ్యాధుల వైద్యశాల



పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాల

తూర్పు నియోజకవర్గంలో ఆర్‌సీడీ, మానసిక వైద్యశాల, శ్వాసకోస వ్యాధులు(ఛాతి), విమ్స్, ఈఎన్‌టీ వంటి ప్రభుత్వ ఆస్పత్రులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిల్లో వైద్యం పొందేందుకు నిరంతరం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వీరికి సరిపడే మందుల సరఫరా అయితే లేదు. దీంతో చాలా వరకు మందులను బయట కొనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాన్‌టాప్, టెన్లీ క్లిస్టీన్, లిథియం కార్బోనేట్, క్లోనాజెపం, సోడియం వాల్ప్రోయేట్, ఎస్కిటోప్రామ్, సెర్ట్రాలిన్, కార్బమాజెపైన్ మందులతో పాటు ముక్కులో వేసే జైలోమేట్ డ్రాప్స్ వంటివి అందుబాటులో లేవు. ముఖ్యంగా ఓపీ రోగులు ఈ మందులు అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బయట మెడికల్ షాపుల్లో వందల రూపాయలు ఖర్చు చేసి పేద రోగులు మందులు కొనాల్సి వస్తోంది.

జనరిక్ మందుల కొనుగోలు

గత వైఎస్సార్‌సీపీ పాలనలో రోగుల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేని మందులను ప్రైవేటులో కొనేందుకు అనుమతులిచ్చింది. కూటమి ప్రభుత్వం అందుబాటులో లేని మందులను జనరిక్ షాపుల్లో మాత్రమే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. వాటిలో కూడా చాలా మందులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో చాలా జాప్యం జరుగుతోంది.



ప్రభుత్వ చాతి ఆస్పత్రిలో కూలిన సీలింగ్ కింద ఉన్న రోగులు

చాతి ఆస్పత్రిలో సీలింగ్ కిందే రోగులు

పెదవాల్తేరులోని ప్రభుత్వ శ్వాసకోశ వ్యాధుల (చాతి) వైద్యశాలలో మెరుగైన వైద్యం పక్కన పెడితే రోగులను కూలిన సీలింగ్ కింద ఉంచుతున్నారు. ఇప్పటికే సగం కూలిపోయిన సీలింగ్ ఏ క్షణాన పూర్తిగా కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అటువంటి గదిలో రోగులను ఉంచి

ఆస్పత్రి ఉన్నతాధికారులు వైద్యం అందిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. వ్యాధి ఎప్పుడు నయమవుతుందా.. ఆస్పత్రి నుంచి ఎప్పుడు బయట పడతామా అని రోగులు బిక్కు బిక్కుమంటూ ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్పత్రులను సక్రమంగా నిర్వహించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని రోగులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత భాస్కరరాజుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన దంతులూరి భాస్కరరాజు రూ.లక్ష 116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున ప్రొటోకాల్ సూపరింటెండెంట్ దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అధికారులు అందించారు.

క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు..



తప్పిపోయిన చిన్నారిని తండ్రికి అప్పగిస్తున్న మెరైన్ పోలీసులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో తప్పిపోయిన చిన్నారిని మెరైన్ పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంజాబ్‌కు చెందిన ప్రీత్ సింగ్ తన కుటుంబంతో బీచ్‌లో గడిపేందుకు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. బీచ్‌లో స్నానాలు చేస్తుండగా తీరం ఒడ్డున ఉంచిన వారి కుమార్తె కవునూర్ కౌర్ తప్పిపోయింది. చిన్నారి లేకపోవడాన్ని గమనించిన తల్లిదండ్రులు తీరమంతా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చిన్నారిని వెతికి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో టాయిలెట్ల ఆధునికీకరణ



ఆధునికీకరించిన టాయిలెట్లను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

మద్దిలపాలెం: మద్దిలపాలెం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఆధునికీకరించిన టాయిలెట్లను ఆదివారం ఏపీఎస్ ఆర్టీసీ విశాఖ జిల్లా రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు చేతుల మీదుగా పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులకు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు అందించడానికి టాయిలెట్లను ఆధునికీకరించినట్లు తెలిపారు. మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో గత నెలలో ఆర్వో ప్లాంట్ తాగునీటి సదుపాయం కల్పించామన్నారు. బస్ స్టేషన్లను మరింత శుభ్రంగా ఉంచడంతోపాటు బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా శుభ్రంగా ఉంచి ప్రయాణికుల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. ప్రైవేటు బస్సులకు దీటుగా ఆర్టీసీ బస్సులను నడిపి మరింత ఆదాయం తేవాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ మేనేజర్ మాధురి, స్టేషన్ మేనేజర్ మూర్తి, సూపర్ వైజర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్‌సిటీలో కొత్త ఆస్పత్రి ప్రారంభం



మెడ్‌సీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

ఆరిలోవ: స్థానిక హెల్త్‌సిటీలో మరో కొత్త ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. పినాకిల్ హాస్పిటల్ పక్క రోడ్డులో నిర్మించిన మెడ్‌సీ ఆస్పత్రిని ఆదివారం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీరాణి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, నగరంలో ముఖ్యమైన వైద్యులతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఆస్పత్రి నిర్వాహకులకు వారు సూచించారు. ఈ సందర్భంగా మెడ్‌సీ చైర్మన్ బి.శిరీషారాణి మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు, 108 పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని విభాగాలతోపాటు ప్రత్యేకంగా గైనిక్ విభాగం, ఐవీఎఫ్ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, మాజీ డీఎంఈ డాక్టర్ ఆర్.శశిప్రభ, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవిరాజు, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ టి.రాధ, ఎస్ఆర్ఐ హాస్పిటల్స్ డీన్ డాక్టర్ పి.వి.సుధాకర్, ఎల్లె సెంట్ ఢిల్లీ సెంటర్ వైద్యుడు డాక్టర్ నవినీత్, డాక్టర్ పద్మావతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక నిత్య హితోక్తులు' పుస్తకావిష్కరణ



సామాజిక నిత్య హితోక్తులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి


సీతంపేట: కళావేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ నందూరి రామకృష్ణ రచించిన సామాజిక నిత్య హితోక్తులు 3వ వచన సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. కళావేదిక కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే హితోక్తులు రచించిన నండూరిని అభినందించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు ఎం.సుబ్బారావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్-1 అధ్యక్షుడు జి.తనూజారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ గంట్ల శ్రీనుబాబు, కళావేదిక వ్యవస్థాపకుడు నండూరి రామకృష్ణ, సంస్థ గౌరవాధ్యక్షులు కమల్ బైద్, ప్రధాన కార్యదర్శి బి.రజని, కార్యదర్శి అరుణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇవటూరి' పుస్తకాల ఆవిష్కరణ

ప్రముఖ కవి ఇవటూరి గౌరీశం రచించిన శివ భావ నాలహరి, శివ కథా సుధలు, శ్రీరామ పద్య మణిమంజరి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సి.ఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పుస్తకాలను ఆవిష్కరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, సిహెచ్.చిన సూర్యనారాయణ పుస్తక సమీక్ష చేశారు.

ఎండిపోతున్న మొక్కలు.. కన్నెత్తి చూడని అధికారులు





ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రహదారుల్లో డివైడర్లపై ఎండిపోతున్న మొక్కలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రహదారుల్లోని డివైడర్లపై నాటిన మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఇక్కడ జీవీఎంసీ సోలార్ ప్లాంట్, ముడసర్లోవ రిజర్వాయర్‌లో వాటర్ సోలార్ ప్లాంట్ ఉండటంతో డివైడర్‌ను అందంగా తయారు చేశారు. డబుల్ రోడ్డు మధ్యలో ఐదడుగుల డివైడర్‌పై పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలతోపాటు అందం, ఆహ్లాదం కోసం మరికొన్ని పూల రకాల మొక్కలను రెండేళ్ల కిందట నాటారు. అవి వివిధ రకాల పూలతో నిండుగా ఉండేవి. కొద్ది నెలలుగా ఆ మొక్కలు ఎండిపోతున్నాయి. జీవీఎంసీ సిబ్బంది వాటికి నీరు పోయకపోవడంతో డివైడర్‌లో మట్టి ఎండిపోయి పచ్చదనం మాడిపోతోంది. బీఆర్‌టీఎస్ రోడ్లలో డివైడర్లపై ఉన్న మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది రిజర్వాయర్ వెనుక ఆహ్లాదాన్ని అందించే ప్రాంతంలో మాత్రం మొక్కలను ఎండగడుతున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మొక్కలను రక్షించాలని కోరుతున్నారు.

అందాల రామయ్య.. సుగుణాల సీతమ్మ

నియోజకవర్గంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకుల వేద మంత్రాల నడుమ అందాల రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మకు కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. శ్రీరామ పట్టాభిషేకాలు ఘనంగా చేపట్టారు. భక్తులు వేకువజాము నుంచి ఆలయాలకు వెళ్లి సీతారాములను కనులారా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీల సభ్యులు పులిహోర, వడపప్పు, పానకం, చక్రపొంగలి తదితర ప్రసాదాలను అందజేశారు. వాడవాడలా ఆలయాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



పాండురంగాపురం రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



చినగదిలి నార్త్ షిర్డీసాయి మందిర ఆవరణలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పైనాపిల్ కాలనీ రామాలయం, దుర్గాబజార్, భరత్‌నగర్ ప్రాంతాల్లోని వేంకటేశ్వర స్వామి, శ్రీకాంత్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం, పార్వతీనగర్‌లో రామాలయం, తోటగరువులో శ్రీకృష్ణ మందిరం, పెదగదిలి, చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో ఆంజనేయ గుడి, హనుమంతవాక వద్ద కోదండ రామాలయం, రవీంద్రనగర్ దరి ఎస్.ఐ.జి.నగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లో, ఎస్టీ, ఎస్సీ కాలనీలో రామాలయం, కో ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో రామాలయం, వెటర్నరీ కాలనీ లక్ష్మీనారాయణ ఆలయం, శ్రీహరినగర్‌లో వేణుగోపాల స్వామి ఆలయం తదితర ఆలయాల్లో విశేష పూజలు, సీతారామ కల్యాణోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాములను పల్లకీలో ఊరేగించారు. సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

ప్రేమసదన్‌లో రాములోరి కల్యాణోత్సవం

ఎంవీపీకాలనీ: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ శ్రీ సత్యసాయి ప్రేమసదన్ వేదికగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణాన్ని తిలకించారు. సంస్థ కన్వీనర్ డి.వి.వి.సీతారామరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, పదాధికారులు, నగర భక్తులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వేద పండితుల శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- అప్పుఘర్‌లోని సీతారామ సాగర లింగేశ్వర ఆలయంలో రాములోరి కల్యాణం వేడుకగా జరిగింది. అప్పుఘర్‌కు చెందిన మత్స్యకార భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కల్యాణ కాంతులు.. అన్నసమారాధనలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెంలోని హనుమత్ సీతారామ లక్ష్మణుల ఆలయ సముదాయంలో శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు రంపా రామ్మోహన్ శర్మ, రంపా మురళీశర్మ ప్రత్యేక పూజలు చేశారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఏయూ మాజీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు దంపతులు, పలువురు ప్రముఖులు సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం సుమారు 5 వేల మందికి పైగా భక్తులు మహా అన్నదానంలో పాల్గొన్నారు. సాయంత్రం హనుమత్ సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు.

- 22వ వార్డు శివాజీపాలెంలోని సాయిబాబా మందిరంలో శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం 5 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, గౌరవ అధ్యక్షుడు కొర్రాయి రమేష్, ప్రధాన కార్యదర్శి బుద్దల కృష్ణ, ఉపాధ్యక్షుడు తోనంగి శ్రీనివాసరావు, ఆవాల వెంకటరమణమూర్తి, దువ్వి సంతోష్‌కుమార్, దువ్వి సురేష్ కుమార్, సహాయ కార్యదర్శి మువ్వల మౌళి, మాడుగుల హరిప్రసాద్, పిల్లల సాంబశివరావు, ఒమ్మి అప్పారావు, సభ్యులు చెల్లుబోయిన సునీల్ కుమార్, దువ్వి వెంకటస్వామి పాల్గొన్నారు.
- 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో లక్ష్మీగణపతి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.
- కొత్త వెంకోజీపాలెంలో జాతీయ రహదారి పక్కనున్న సీతారాముల ఆలయంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిగింది.
- ఇసుకతోట రామాలయంలో శ్రీ సీతారామ సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో పలువురు జంటలు కల్యాణం జరిపారు.
- ఇసుకతోట కృష్ణ మందిరంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా చేపట్టారు. భక్తులకు పంక్తి భోజనాలు నిర్వహించారు
- హెచ్‌బీ కాలనీలోని శ్రీవేదమాత గాయత్రి మాత ఆలయంలో విద్యార్థులు స్థాపించిన శ్రీ రామదండు అభినవ సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం, సాయంత్రం దీపాలంకరణ చేశారు. భక్తులచే గీత నృత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



ప్రేమసదన్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



వెటర్నరీ కాలనీ లక్ష్మీనారాయణ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కేఆర్‌ఎం కాలనీలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు



శివాజీపాలెంలో శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఏయూ అవుట్ గేట్ వద్ద కోదండ రామాలయంలో కోలాటమాడుతున్న మహిళలు

ఆరిలోవ: ఆర్కే బీచ్ దరి పాండురంగాపురంలోని రుక్మిణి సమేత ప్రసన్న పాండురంగ స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి ఉత్సవాలు, సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సంస్థ అధినేత భానురేఖ పాల్గొన్నారు.

- కల్యాణ నగర్‌లోని ఏయూ అవుట్ గేటు వద్ద కోదండ రామాలయంలో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు ప్రదర్శించిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.